## భగత్‌సింగ్ స్ఫూర్తితో

# అన్యాయాలపై పోరాటం అవసరం

- యువత చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపు
- అమరులకు ఘన నివాళులు అర్పించిన నాయకులు



**దేవనకొండ, మార్చి 23 (స్ఫూర్తి పత్రిక):** అమర వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా దేవనకొండ మండలంలో పలు ప్రాంతాల్లో నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కోటకొండ, తెర్నేకల్, కుంకునూరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు పాల్గొని అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు వై. మహేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి ముక్కెల్ల అశోక్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కే. శ్రీనివాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ కీలక పాత్ర పోషించారని, 23 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి పోరాటం కేవలం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా సమాజంలో ఉన్న అన్యాయం, దోపిడి, అసమానతలపై కూడా సాగిందని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ శక్తులు దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరిస్తున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని, రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, కార్మికులకు తగిన వేతనాలు, భద్రత కల్పించబడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో భగత్‌సింగ్ ఆలోచనలు మరింత ప్రాముఖ్యత పొందుతున్నాయని తెలిపారు.యువతను దారి మళ్లించే అంశాలపై కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, మత్తు పదార్థాల వ్యసనం వంటి సమస్యలు యువతను బలహీనపరుస్తున్నాయని, చైతన్యవంతమైన యువత సమాజ మార్పు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.విద్య, ఆరోగ్యం, ఉపాధి హక్కులుగా మారే సమాజ నిర్మాణం కోసం పోరాటాలు అవసరమని, సమానత్వం, సామాజిక న్యాయం లక్ష్యంగా యువత కృషి చేయాలని సూచించారు.అనంతరం డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూసుఫ్ భాష, వీరేంద్ర నాయుడు, రంగన్న, పాండురంగడు, పెద్దయ్య, రామాంజనేయులు, బలరాముడు, మధు, రాము, అనిల్ కుమార్, నాగేంద్ర, మహబూబ్ భాషా, సుధాకర్, రవీంద్ర, బజారి, పరమేష్, దొడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై వేగవంతంగా విచారణ...

# బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ప్రజా ఫిర్యాదుల వేదికకు 85 వినతులు
- ఉద్యోగ మోసాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు ప్రధాన ఫిర్యాదులు



**కర్నూలు, మార్చి 23 (స్ఫూర్తి పత్రిక):** జిల్లాలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 85 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ, బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సంబంధిత పోలీసు అధికారులను వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో ఉద్యోగాల పేరుతో మోసాలు, భూమి, ఆస్తి వివాదాలు, ఆర్థిక మోసాలు ఎక్కువగా నమోదైనట్లు వెల్లడైంది. హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి భారీ మొత్తంలో డబ్బులు తీసుకొని మోసం చేసిన ఘటనలపై పలు ఫిర్యాదులు నమోదయ్యాయి.అలాగే పెట్టుబడుల పేరుతో మోసాలు, బంగారం తాకట్టు సమస్యలు, ప్లాట్లపై డబుల్ రిజిస్ట్రేషన్లు, కుటుంబ ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా అధికంగా ఉన్నట్లు తెలిసింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు, ఉద్యోగ ఆఫర్లు, పెట్టుబడి పథకాల విషయంలో పూర్తి వివరాలు తెలుసుకుని మాత్రమే ముందుకు వెళ్లాలని హెచ్చరించారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకుని పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల సాధనకే పోరాటం...

# ప్రభుత్వానికి బీసీవై పార్టీ గడువు

- ఐదు డిమాండ్లపై తక్షణ చర్యల డిమాండ్
- మార్చి 31లోగా స్పందించకపోతే నిరాహార దీక్ష హెచ్చరిక




**హోళగుంద, మార్చి 23 (స్ఫూర్తి పత్రిక):** వెనుకబడిన తరగతుల హక్కుల సాధన లక్ష్యంగా బీసీవై పార్టీ తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తోంది. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి సంబంధించిన ప్రధాన అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అర్జున్ వాల్మీకి ఆధ్వర్యంలో నాయకులు కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలు గత ఎన్నో దశాబ్దాలుగా వివక్షను ఎదుర్కొంటున్నారని, వారి అభివృద్ధికి సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం పార్టీ రూపొందించిన ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచినట్లు తెలిపారు.బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని అమలు చేయడం, అమరావతి రాజధాని ప్రాంతంలో బీసీలకు భూమి కేటాయింపు, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహణ, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 44 శాతం రిజర్వేషన్లు కల్పించడం, బీసీ కార్పొరేషన్లకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయడం వంటి అంశాలను తక్షణమే అమలు చేయాలని పార్టీ డిమాండ్ చేసింది.ఈ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వానికి మార్చి 31 వరకు గడువు విధించినట్లు తెలిపారు. ఆలోపు ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత మార్గంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని స్పష్టం చేశారు.జిల్లా యంత్రాంగం తమ వినతిపత్రాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, బీసీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## గ్యాస్ వినియోగంపై తనిఖీలు ప్రారంభం

# - దేవనకొండలో అధికారుల కదలిక

- వార్తల నేపథ్యంలో అధికారుల చర్యలు
- హోటళ్లు, బంకుల్లో సిలిండర్ల తనిఖీ
- గృహ వినియోగంపై నిఘా పెంపు






**దేవనకొండ, మార్చ్ 23 (స్ఫూర్తి పత్రిక):** దేవనకొండ మండలంలో గ్యాస్ సిలిండర్ల వినియోగంపై ఉద్భవించిన సందేహాలు, వినియోగదారుల ఆందోళనల నేపథ్యంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్‌సైడ్ బంకుల్లో గ్యాస్ వినియోగంపై సమీక్ష నిర్వహించినట్లు సమాచారం.ప్రత్యేకంగా గృహ వినియోగ సిలిండర్లు కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో సిలిండర్ల వినియోగ విధానంపై వివరాలు సేకరించి, సంబంధిత నిబంధనలను పాటించాలని సూచించినట్లు సమాచారం.అయితే ఈ తనిఖీలు పరిమిత స్థాయిలో మాత్రమే జరిగాయని, పూర్తి స్థాయి తనిఖీలు జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గ్యాస్ బుకింగ్ చేసిన వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ కొనసాగుతోంది

## హోం గార్డులకు వెల్ఫేర్ ఫండ్ చెక్కుల పంపిణీ

- మెడికల్ గ్రాంట్‌గా ఇద్దరికి ఆర్థిక సాయం





**కర్నూలు, మార్చి 23 (స్ఫూర్తి పత్రిక):** హోం గార్డుల సంక్షేమం దృష్ట్యా హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని కర్నూలులో పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు కమాండెంట్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ ఇద్దరు హోం గార్డులకు మెడికల్ గ్రాంట్ కింద చెక్కులను అందజేశారు. కర్నూలు యూనిట్‌కు చెందిన హోం గార్డు పి. సురేష్ కుమార్‌కు రూ.10,000, మహిళా హోం గార్డు వి. భారతికు రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు.హోం గార్డులు విధి నిర్వహణలో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిబ్బంది సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇంచార్జ్ ఎస్.ఎల్. కాంతరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది, హోం గార్డులు పాల్గొన్నారు.

## కర్నూలులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

- అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణలపై కఠిన చర్యలు
- రద్దీ ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు





**కర్నూలు, మార్చి 23 (స్ఫూర్తి పత్రిక):** నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని కర్నూలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు, మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రహదారులను ఆక్రమించి నిలిపిన తోపుడు బండ్లు, అనధికార పార్కింగ్ వాహనాలు మరియు ఇతర అడ్డంకులను తొలగించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో వాహనదారులు, వ్యాపారులు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రహదారులపై వాహనాలను అడ్డంగా నిలపకుండా ఉండాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## పెద్దహ్యాటలో రహదారి సమస్యల పరిష్కారానికి ప్రారంభం

పెద్దహ్యాటలో రహదారి పనులకు వేగం

- ఉత్సవాల ముందు చర్యలు
- తాత్కాలిక ఉపశమనం చర్యలు



**హోళగుంద, మార్చ్ 23 (స్ఫూర్తి పత్రిక):** హోళగుంద మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో రహదారుల మెరుగుదల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఊరు దేవర ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని ప్రధాన దారుల్లో గ్రావెల్ వేసి చదును చేసే పనులు చేపట్టారు.గ్రామంలోని పలు రహదారులు గత కొంతకాలంగా అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని, దీంతో గ్రామస్థులు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ఉత్సవాల సమయంలో గ్రామానికి వచ్చే భక్తులు, సందర్శకులు ఇబ్బందులు పడకుండా ఉండేలా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ పనులు ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి సూచనలతో ప్రారంభమైనట్లు తెలిపారు. తాత్కాలిక ఉపశమనంగా గ్రావెల్ వేసి రహదారులను చదును చేయడం ద్వారా వాహన రాకపోకలు సులభతరం అవుతాయని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వీరేష్, బద్రి సహా స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పరీక్షలకు గైర్హాజరు విద్యార్థులు

### - హోళగుందలో గణిత పరీక్ష హాజరులో తగ్గుదల



**హోళగుంద, మార్చ్ 23 (స్ఫూర్తి పత్రిక):** హోళగుంద మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా సోమవారం నిర్వహించిన గణిత పరీక్షలో 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారులు సుధారాణి, కబీర్ సాబ్ వెల్లడించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 703 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, అందులో 690 మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారని వివరించారు.పరీక్షల నిర్వహణ మొత్తం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టి, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయగలిగేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.అలాగే పరీక్షల పర్యవేక్షణలో భాగంగా అధికారులు క్రమం తప్పకుండా కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. హాజరు శాతం సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ, గైర్హాజరు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

